ఉత్తమ కమ్యూనిస్టు జియావుద్దీన్ సర్

- అన్ని విజ్ఞానశాస్త్రాలకు జన్మస్థలం విద్య
- సోషలిజంలోనే అందరికీ సమాన అవకాశాలు
- లౌకికతత్వం లేకపోతే సర్వమత సమానత్వం ఉండదు
- జియావుద్దీన్ సంస్మరణ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని,
- ఎఐఎడబ్ల్యుయు వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జియావుద్దీన్ సర్ ఉత్తమ కమ్యూనిస్టు అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లటమే మనముందున్న కర్తవ్యమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. అన్ని విజ్ఞానశాస్త్రాలకు విద్యమాత్రమే జన్మస్థలమని, అటువంటి విద్యలో విద్యార్థులు రాణించేలా కృషి చేశారని తెలిపారు. యూటీఎఫ్ మాజీ రాష్ట్రనాయకులు, సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ జియావుద్దీన్ సర్ సంస్మరణ సభ ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సభలో తమ్మినేని మాట్లాడుతూ.. మార్క్సిజం, లెనినిజం స్పృశించే అన్ని పార్శ్వాలను జియావుద్దీన్ అనుసరించారని తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి నుంచి జిల్లా కమిటీ సభ్యునిగా సైద్ధాంతికంగా ఎదిగారన్నారు. నదికి జన్మస్థానంతో పాటు ముగింపు సముద్రమనట్టే ఆయన ఉపాధ్యాయ వృత్తి, ఉద్యమాలను మేళవించి పనిచేశారని తెలిపారు. ఉత్తమ కమ్యూనిస్టు అంటే జియావుద్దీన్ సర్‌ను చూపించొచ్చన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లటమే మన ముందున్న కర్తవ్యమని చెప్పారు.

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ.. విదేశాలపై ఆధారపడటాన్ని ప్రధాన శత్రువుగా ప్రధాని నరేంద్రమోడీ ఇన్నాళ్లకు గుర్తించారని అన్నారు. కమ్యూనిస్టు దేశం చైనా 80శాతానికి పైగా ఉత్పత్తులను స్థానిక మార్కెట్‌లో విక్రయించుకుంటున్న విషయాన్ని ప్రస్తావించారు. ప్రపంచంలోని అన్ని సమస్యలకు పరిష్కారం చూపించేది ఒక్క కమ్యూనిజం మాత్రమేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీ పిల్లలు బాగా చదవాలని, వారిలో స్వావలంబన తీసుకురావాలని కృషి చేసిన వారిలో జియావుద్దీన్ సర్ ఒకరని తెలిపారు. ఎస్టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావా రవి మాట్లాడుతూ.. జియావుద్దీన్ సర్ కృషి, త్యాగాలు చరిత్రాత్మకమని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించేవారని, స్కూల్‌లోనే కూరగాయలు పండించి చక్కని మెనూ అమలయ్యేలా చూశారని గుర్తుచేశారు. కాగా, జియావుద్దీన్ సంస్మరణ సభకు ఆయన శిష్యులు భారీగా తరలివచ్చారు. జియావుద్దీన్ సర్ పనిచేసిన చింతూరు, వీఆర్‌పురం, దమ్మపేట మండలాల్లోని కొత్తూరు నారాయణపురం, సోములగూడెం, గూడూరు, మూల పోచారం, ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి సైతం హాజరయ్యారు. సర్ తమకు నేర్పిన విద్యాబుద్ధులు, క్రమశిక్షణ కారణంగానే తాము ఈ రోజు టీచర్లు, వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డామని గర్వంగా చెప్పుకొచ్చారు. అనంతరం 'జియావుద్దీన్'పై 'నవతెలంగాణ' ప్రచురించిన ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. జియా సర్ చనిపోయేంత వరకూ ధరించిన యూటీఎఫ్ గోల్ ఉంగరాన్ని కుటుంబ సభ్యులు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కమిటీలకు అందజేశారు. దాన్ని ఆయన జ్ఞాపకార్థం అలాగే ఉంచుతామని యూటీఎఫ్ నాయకత్వం ప్రకటించింది. ఈ సంస్మరణ సభలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని, జిల్లా అధ్యక్షులు రంజాన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, కల్యాణం వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం అంతా సౌభాగ్యంగా ఉండాలి

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క
- వరంగల్‌లో బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రకృతిలో లభించే అనేక రకాల పూలతో తొమ్మిది రోజులపాటు మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజిస్తారని, వారి పూజలు ఫలప్రదమై రాష్ట్రంతో పాటు రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం రాత్రి తెలంగాణ సంగీత అకాడమీ ఆధ్వర్యంలో కాకతీయ నృత్య ప్రదర్శనతో పాటు వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగ ప్రారంభం అయిందని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల ఫలవంతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మహిళలంతా ఆర్థికంగా ఎదగడంతో పాటు శక్తివంతులుగా ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆడపడుచులకు అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క స్వయంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటల సీడీని మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజ్, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి గ్రూప్-2 సర్టిఫికెట్ వెరిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్ 2 పోస్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ను ఈ నెల 23, 24, 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చేయనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. అభ్యర్థులకు ఏవైనా సమస్యలుంటే 25న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిజర్వ్ డేగా తెలిపింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి డాక్టర్ ప్రియాంక అల ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి యూనివర్సిటీలో వెరిఫికేషన్ కొనసాగుతుందని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను, అభ్యర్థులు సర్టిఫికేట్ వెరిఫికేషన్ మెటీరియల్‌ను కమిషన్ వెబ్‌సైట్ https://www.tspsc.gov.inలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్స్‌ను ఈ నెల 22 నుంచి 25 వరకు కమిషన్ వెబ్‌సైట్‌లో ఎంపిక చేసుకోవాలి. ఇవే ఆప్షన్స్ ఫైనల్ సెలెక్షన్ కోసం పరిగణించబడతాయనీ అందువల్ల అత్యంత జాగ్రత్త వహించాలని కోరారు. కమిషన్ ప్రకటించిన తేదీల్లో సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు రాని అభ్యర్థుల అభ్యర్థిత్వం తదుపరి ప్రక్రియలో పరిగణించబడదని స్పష్టం చేశారు.

అట్టహాసంగా 'కాకతీయ నృత్య నాటకోత్సవాలు' ప్రారంభం

- ఉపముఖ్యమంత్రి భట్టి,
- మంత్రులు పొంగులేటి, జూపల్లి సురేఖ, సీతక్క హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్న కాకతీయ నృత్య నాటకోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, దనసరి సీతక్కతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ప్రముఖ నాట్య గురు, అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య డాక్టర్ అలేఖ్య పుంజాల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధ్యురాలు చిట్యాల ఐలమ్మ కూచిపూడి నృత్య రూపకం, ఓరుగల్లు చరిత్ర కాకతీయ వైభవం గుర్తు చేస్తూ రాణిరుద్రమ చారిత్రక నాటకం, ప్రజా సాహిత్య కళారూపాలు ప్రదర్శనలు నిర్వహించారు. డాక్టర్ అలేఖ్య పుంజాల నృత్య దర్శకత్వంలో 30 మంది కళాకారులు చిట్యాల ఐలమ్మ జీవిత చరిత్రను కూచిపూడి నృత్య రూపకంలో ప్రజలను హత్తుకునేలా ప్రదర్శించారు. ఈ నృత్య రూపకాన్ని డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ రచించగా, సంగీత దర్శకులు వీబీఎస్ మురళి సంగీతం సమకూర్చారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కళాకారులను ఘనంగా సత్కరించారు. అంతకుముందు హనుమకొండ జిల్లా పర్యటనకు విచ్చేసిన వారికి హోటల్ హరిత కాకతీయలో వారిని ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ డాక్టర్ బండా ప్రకాష్, బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మెన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ నగర సీపీ సన్‌ప్రీత్ సింగ్, సీఎండీ వరుణ్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమీషనర్ చాహత్ వాజ్‌పేయి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఆర్ భూనిర్వాసితులకు అండగా ఉంటాం

- ప్రొఫెసర్ కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రీజినల్ రింగ్ రోడ్ (త్రిబుల్ ఆర్) భూనిర్వాసితులకు అండగా ఉంటామని టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో చౌటుప్పల్, నారాయణపురం, గట్టుప్పల్, మర్రిగూడ మండలాల రైతులు కోదండరాంను కలిశారు. తమకు అండగా ఉండాలని కోరారు. త్రిబుల్ ఆర్ కొత్త అలైన్‌మెంట్‌తో కార్పొరేట్ కంపెనీలు, భూస్వాములకు లాభం జరుగుతుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్‌కు 40 కిలోమీటర్ల దూరం ఉండగా ఇప్పుడు 28 కిలోమీటర్ల దూరంలోనే త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ ఇచ్చారని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కొత్త అలైన్‌మెంట్‌తో చిన్న సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. అనంతరం భూనిర్వాసితులనుద్దేశించి కోదండరాం మాట్లాడుతూ గతంలో భూనిర్వాసితులకు సంబంధించిన అనేక పోరాటాల్లో టీజేఎస్ రైతుల పక్షాన పోరాటం చేసిందని గుర్తు చేశారు. రైతులు తమ భూములకు సంబంధించిన అన్ని విషయాలపై అధ్యయనం చేసి, ఆ భూములు తమకు ఎంత విలువైనవో తెలిపేలా ఒక నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందించాలని కోరారు. ఈ విషయంలో టీజేఎస్ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్ కుమార్, ఆశప్ప, భూ నిర్వాసితుల నాయకులు భీమగాని మహేష్ గౌడ్, పల్లె శేఖర్ రెడ్డి, పల్లె పుష్పారెడ్డి, గుండె మల్లేశం, సుర్వి రాజు, నడికుడి అంజయ్య, బద్దుల వెంకటేష్, వర్ధన్ నాగార్జున, గంట కృష్ణారెడ్డి, గుండె జంగయ్య, గాజుల భగత్, భాస్కర్ రెడ్డి, సుర్కంటి కార్తీక్ రెడ్డి, వడ్డేపల్లి స్వామి, సుర్కంటి శశికళ, చంద్రకళ, పల్లె పుల్లారెడ్డి, కొలను మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి స్టడీ సర్కిళ్లకు నిధులు కేటాయించాలి

- డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 ఎస్‌సి స్టడీ సర్కిళ్లకు నిధులు కేటాయించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. తొమ్మిది నెలలుగా నిధుల కొరతతో స్టడీ సర్కిళ్లు కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. దీంతో వాటిలో ఎటువంటి కోచింగ్ నడపటం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్లలో ఏడాదికి రెండు బ్యాచీలుగా మొత్తం 2,400 మందికి ఉచితంగా కోచింగ్ ఇవ్వాల్సి ఉండగా, 12 నెలలుగా పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటిసున్న ఈ సమయంలో ఎస్సీ స్టడీ సర్కిళ్లలో ఉచిత కోచింగ్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పోటీని తట్టుకుని ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలంటే కోచింగ్ అవసరమని తెలిపారు. ప్రయివేట్ కోచింగ్ సెంటర్లలో అధిక ఫీజులు చెల్లించే పరిస్థితి లేనందున వారు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌పై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్ మార్పు, తదితర సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులతో మాట్లాడకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా, భూ సేకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. బలవంతంగా భూములను తీసుకోవాలని ప్రయత్నం చేస్తే రైతుల నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది జిల్లాలు, 33 మండలాలు, 163 గ్రామాల పరిధిలో రీజనల్ రింగ్‌రోడ్డును 100 మీటర్ల వెడల్పుతో నిర్మించాలని హెచ్‌ఎండిఎ నోటిఫికేషన్‌ను ఇచ్చిందని తెలిపారు. దీనికోసం భూములు తీసుకుంటామని ప్రకటించారని గుర్తు చేశారు. రైల్వే ట్రాక్ కొరకు మరొక 40 అడుగులవెడల్పుతో రోడ్డును పెంచుతామని ప్రభుత్వం చెబుతున్నదన్నారు. మొదటి అలైన్‌మెంట్ మార్చి రెండోసారి అలైన్‌మెంట్ చేశారనీ, ఇప్పుడు మూడో అలైన్‌మెంట్‌ను తయారుచేసి విడుదల చేశారని పేర్కొన్నారు. ఇందులో రాజకీయ అండదండలు, డబ్బు, పలుకుబడి ఉన్న వారి భూముల్లోకి రోడ్డు మార్గం లేకుండా చూస్తున్నారని ఆరోపించారు. ఎకరం, రెండెకరాలు, మూడెకరాలున్న చిన్న సన్నకారు రైతులకు సంబంధించిన భూములున్న ప్రాంతాన్నే రింగ్ రోడ్డుకోసం తీసుకుంటున్నట్టుగా ఆరోపణలొస్తున్నాయని తెలిపారు. ఆ భూములను నమ్ముకునే బతుకుతున్నామన్న రైతులు.. తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రింగ్‌రోడ్డు అలైన్‌మెంటును ఎందుకు మార్చుతున్నదో స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. కేవలం కొద్దిమంది పెద్దల ప్రయోజనాల కోసం సామాన్యమైన చిన్నరైతుల జీవితాలను దెబ్బతీసేటువంటి వైఖరిని మానుకోవాలని సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ భూబాధితుల సమస్యలపై మంగళవారం హైదరాబాద్‌లో ఆయా జిల్లాల, మండలాల బాధ్యులతో సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవాలి

- కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ శాస్త్రవేత్త డాక్టర్ సోమ సుందర్ మార్ల
- జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవాలని రిటైర్డ్ ఇండ్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ శాస్త్రవేత్త, జన్యుశాస్త్రం అధిపతి డాక్టర్ సోమ సుందర్ మార్ల అన్నారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మాదాపూర్ డివిజన్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మూఢనమ్మకాలను ప్రోత్సహించే విధంగా అనేక కార్యక్రమాలను తీసుకొస్తుందని అన్నారు. స్వతంత్ర భారతదేశంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్‌ని అభివృద్ధి చేయాలని రాజ్యాంగంలో సైతం పొందుపరచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. యువత మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ సైన్స్ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు మూఢ నమ్మకాలను నిరోధిస్తూ చట్టాలను తీసుకొచ్చినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేయడం ద్వారా విద్యార్థి దశ నుంచే సైన్స్ వైపు పిల్లల నైపుణ్యం, సృజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. కానీ నేడు కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా యువతను పూర్తిగా మూఢనమ్మకాల వైపు నెట్టే విధంగా ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సైంటిఫిక్ టెంపర్‌ను పెంచే విధంగా ప్రయత్నం చేస్తున్నప్పటికీ తగినంతగా పని జరగడం లేదన్నారు. భవిష్యత్తులోనైనా మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బాబు, డాక్టర్ కోయ వీ.రావు మాట్లాడారు. మూఢ నమ్మకాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను చెప్పారు. సైన్స్ గొప్పతనాన్ని తెలిపారు. సైన్స్‌కు సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి రవీందర్ బాబు, లింగస్వామి, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం... లక్ష ఎకరాలు

- ఉద్యాన పంటల సాగుపై సర్కారు ఫోకస్
- సన్న, చిన్నకారు రైతులకు భారీగా ప్రోత్సాహకాలు
- రైతుల ఖాతాలో నగదు జమ చేసేందుకు చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్లుగా పడకేసిన ఉద్యాన శాఖకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలో ఉద్యాన పంటలను విరివిగా ప్రోత్సహించేందుకు ఆ శాఖ ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం 2.3 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతుండగా, అది క్రమంగా తగ్గుతోంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఆ పంటల సాగు లక్ష్యం... లక్ష ఎకరాలుగా ఉద్యాన శాఖ నిర్దేశించుకుంది. ఈ పంటల సాగు ప్రాధాన్యతను తెలియజేస్తూ... ఊరూరా రైతులకు అవగాహన కల్పించేందుకు అధికారులు ప్లాన్ చేశారు. రాష్ట్రానికి అవసరమైన పండ్లు, కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఉద్యాన పంటల సాగు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా అధ్యయనం చేసినట్టు తెలిసింది. అందులో రైతులకు సులువైన మార్కెట్ సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని తేల్చింది. మార్కెట్లలో దళారుల దోపిడీని తగ్గించేందుకు రైతులకు చిన్న, చిన్న యంత్రాలను అందుబాటులోకి తేవడం, వాటికి 30 నుంచి 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని భావించింది. రైతులు భూసార పరీక్షలను చేయించకుండానే తోచిన పంటలు వేస్తున్నారు. ఆ పరిస్థితులను మార్చేందుకు నేలల స్వభావాన్ని బట్టి పంటలను ప్రోత్సహించేందుకు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. ఏ పంటను ఏ నేలలో వేయాలనేది రైతులకు అవగాహన కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించనుంది.

శ్రమ తక్కువ... ఆదాయం ఎక్కువ

సన్న, చిన్నకారు రైతులకు ఉద్యాన సాగు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు శ్రమ తక్కువగా ఉంటుంది. ఆదాయం ఎక్కువగా వస్తుంది. బోర్లు, బావుల కింద ఈ పంటలు వేస్తే నీటి ఆదాతోపాటు, ఆదాయం అధికంగా వస్తోంది. ఈ ఏడాదిలో లక్ష ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించింది. రానున్న నాలుగైదు ఏళ్లలో పండ్లు, కూరగాయల సాగులో స్వయంసమృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో మామిడి పళ్లు తప్ప ఇతర పండ్లు, కూరగాయలు దిగుమతి చేసుకునే పరిస్థితులే ఉన్నాయి. అలాంటి పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు భారీగా రాయితీ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. దీంతో ధరలు అధికంగా ఉండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేకపోతున్నారు. వారికి అందుబాటులో ఉండాలంటే రాష్ట్రంలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు ఇస్తే రైతులు సాగు చేసేందుకు ముందుకు వస్తారని సర్కారు భావిస్తోంది.

పంటలే కాదు...అనుబంధంగా ప్రాసెసింగ్ యూనిట్లు

ఉద్యాన పంటలను ప్రోత్సహించడమే కాకుండా వాటికి అనుబంధంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా చేస్తోంది. విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, పాలీహౌస్‌లు, కోల్డ్ స్టోరేజీలు, సౌర విద్యుత్ సరఫరా కేంద్రాలు, పంటలను ఎండబెట్టే యంత్రాలు రైతులకు అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. సేంద్రియ సాగును ప్రోత్సహించడం, నర్సరీలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం వంటి లక్ష్యాలను పెట్టుకుంది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నట్టు తెలిసింది. అయితే కేంద్రం కూడా తన వాటా ఇస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న రాయితీలకు ఉద్యానశాఖ నిధులను ప్రకటించింది. గతంలో మూడెకరాల వరకు సబ్సిడీ పరిమితి ఉండగా, ప్రస్తుతం గరిష్టంగా ఐదు ఎకరాల వరకు సాయం ఇవ్వనుంది. మామిడి, డ్రాగన్, అవకాడో, బత్తాయి, అరటి, జామ, బొప్పాయి తదితర పండ్ల తోటలకు ఎకరాకు రూ.20 నుంచి 32వేలు, పుట్టగొడుగుల పెంపకానికి ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.12లక్షల వరకు ఆర్థిక సాయం అందించనుంది. కూరగాయల సాగుకు ఎకరాకు రూ.9,600, ఉల్లి, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, పసుపు, పూలు, జీలకర్ర, వాము, సుగంధ ద్రవ్యాలకు ఎకరానికి రూ.8వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. జర్బెర, ట్యూబెరోస్, గ్లాడియోలస్, లిల్లీ వంటి పూలసాగుకు ఎకరాకు రూ.40 వేలు, పాత తోటల పునరుద్ధరణకు కూడా సాయం చేయనుంది. నీటి వనరుల అభివృద్ధి కోసం రూ.2.73 కోట్లు, ప్లాస్టిక్ మల్చింగ్ కోసం రూ.14.24 కోట్ల నిధులను కేటాయించింది.

దసరా సెలవుల్లో విద్యాసంస్థలు నడపొద్దు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో విద్యాసంస్థలను నడపకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాసంస్థలకు సెలవులిచ్చినా కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు నడిపేందుకు ఆయా సంస్థల యజమాన్యాలు పూనుకుంటున్నాయని తెలిపారు. ఆ విద్యాసంస్థలు నడపకుండా చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖాధికారులు వాటికి దాసోహమవుతూ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. దసరా సెలవుల్లో విద్యాసంస్థలు నడిపితే విద్యాసంస్థల ముందు ఆందోళనలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

సరుకు రవాణాలో రైల్వే బెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరుకుల రవాణాలో రైల్వే ఉత్తమ సేవలనందిస్తున్నదని పలువురు సరుకు రవాణా వినియోగదారులు ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే పౌర సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆహార ఉత్పత్తులను మిగులు ఉన్న ప్రాంతాల నుంచి లోటు ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్లడంలో రైల్వే అందిస్తున్న అన్నపూర్ణ సేవలు బాగున్నాయని భారత ఆహార సంస్థ ప్రశంసించింది. అన్ లోడింగ్ పాయింట్ల వద్ద ట్రక్ ప్లానింగ్‌తో పాటు లేబర్ అనుమతిని కొనియాడింది. రోడ్డు రవాణాతో పోల్చుకుంటే రైల్వే అందిస్తున్న గతి-వాహన్ సర్వీసులు రవాణా సమయాన్ని 70 గంటల నుంచి 28 గంటలకు తగ్గించిందని మారుతి సుజికీ లిమిటెడ్ పేర్కొంది. నిర్యాత్ కార్గో సర్వీస్‌ను ఉపయోగించుకుని ముంద్రా పోర్ట్ 40 గంటల్లోపు రవాణా చేయగలుగుతున్నామనీ, సమయానికి పోర్టులతో, షిప్పింగ్ కంపెనీలతో సమన్వయం కుదురుతుందని తెలిపింది. అనంత్‌నాగ్ సిమెంట్ కార్గో సర్వీస్ బాగుందని సిమెంట్ కంపెనీలు హర్షం వ్యక్తం చేశాయి. రైల్వే కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన అన్నపూర్ణ సర్వీస్ లుధియానా నుంచి వారణాసికి (704 కిలోమీటర్లు) దూరం ఆహార ఉత్పత్తులను 17 గంటల్లో తీసుకెళ్తుంది. గతి-వాహన్ సర్వీస్ ఫర్రూఖ్ నగర్ (హర్యానా) నుంచి లక్నోకు (557 కిలోమీటర్లు) ఆటోమొబైల్స్‌ను 28 గంటల్లో చేరుస్తున్నది. గతి వాహన్ ప్రవేశానికి ముందు 70 గంటలకు పట్టేది. నిర్యాత్ కార్గో సర్వీస్ ద్వారా గర్హి నుంచి ముద్రా పోర్ట్‌కు (1061 కిలోమీటర్లు) కేవలం 32 గంటల్లో, అనంత్‌నాగ్ సిమెంట్ కార్గో సర్వీస్‌తో రూప్ నగర్ నుంచి అనంత్‌నాగ్‌కు (586 కిలోమీటర్లు) సిమెంట్ ను 31 గంటల్లో మోసుకెళ్తుంది. రైల్వే సరుకు రవాణాలో కొత్తగా చేరిన ఈ సర్వీసుల పట్ల ఆయా పరిశ్రమల వర్గాల నుంచి అభినందనలు వెల్లుతుతున్నాయి.

టిజిఒ కేంద్ర సంఘం మహిళా విభాగం ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిజిఒ కేంద్ర సంఘం మహిళా విభాగం 103 మంది సభ్యులతో ఏకగ్రీవమైంది. హైదరాబాద్ నాంపల్లిలోని గెజిటెడ్ భవన్‌లో ఆ విభాగం చైర్‌పర్సన్‌గా జి.దీపారెడ్డి, కన్వీనర్‌గా జక్కంపూడి సుజాత, కోశాధికారిగా శాంతిశ్రీ ఎన్నికయ్యారు. టిజిఒ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన మహిళా గెజిటెడ్ అధికారుల విభాగం కార్యవర్గానికి శ్రీనివాసరావుతో పాటు టిజిఒ ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ నియామకపత్రాలను అందజేసి, ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో మహిళలు పోషించిన, పోషిస్తున్న పాత్ర గొప్పదని వారు కొనియాడారు. అనంతరం జి.దీపారెడ్డి అధ్యక్షతన కార్యవర్గం సమావేశమై పలు తీర్మానాలను ఆమోదించారు.

బతుకమ్మ పోస్టర్ విడుదల

గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ పండుగ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణతో పాటు అసోసియేట్ ప్రెసిడెంట్ బి.శ్యాం, కోశాధికారి ఉపేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు, మహిళా విభాగం బాధ్యులు పాల్గొన్నారు. ఈ నెల 21 నుంచి 30 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ పండుగను నిర్వహించుకోవాలని, సెప్టెంబర్ 27న నాంపల్లిలోని గెజిటెడ్ భవన్‌లో బతుకమ్మ వేడుకలు ఉంటాయని నాయకులు ప్రకటించారు.

మహారాజశ్రీ సీనియరు సివిల్ జడ్జి, బొబ్బిలి వారి దివ్యసముఖమునకు
I.A.No.177/2024, I.A.No.178/2024, I.A.No.179/2024, A.S.No.17/2017

బిట్వీన్:
తెన్నేటి నారాయణమూర్తి
....పిటీషనరు-అప్పిలెంటు
మరియు :
తెన్నేటి కృష్ణ మూర్తి (Died) వగైరా
.....రెస్పాండెంట్లు ప్రతిపాదిత రెస్పాండెంట్లు

నోటీసు

టు: **R.6 :** తెన్నేటి సీతాదేవి భర్త లేటు కృష్ణ మూర్తి, C/o వి. వి. రామారావు, D.No.17-1-12, పద్మనగర్ కాలనీ, P.T. కాలనీ, హైదరాబాదు, తెలంగాణ.
R.7 : తెన్నేటి రవి శాస్త్రి తండ్రి లేటు కృష్ణ మూర్తి, C/o వి. వి. రామారావు, - Rest do -
R.8 : తెన్నేటి రమ్య తండ్రి లేటు కృష్ణ మూర్తి, C/o వి. వి. రామారావు, - Rest do -

పై నెంబరు అప్పీలు దావాలో సి.పి.సి ఆర్డరు.22, రూలు.4, ఆర్డరు.22, రూలు.9, సెక్షన్.5. లిమిటేషన్ చట్టం మరియు సెక్షన్. 151 సి.పి.సి ప్రకారం పిటీషన్లు దాఖలు చేయగా సదరు పిటీషన్లలో శ్రీకోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపుచున్నప్పటికిన్నీ మీరు తప్పించుకు తిరుగుచున్నందున యిందుమూలముగా తెలియచేయునది ఏమనగా మీరు **తే.25-09-2025 ది న ఉదయం 10-30 గంటలకు** స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరయి మీ జవాబు దాఖలు చేసుకోవలెను. లేనియెడల పై నెంబరు దావా మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందుమూలముగా తెలియచేయడమయినది.

(పై శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం)

పి. మోహన మురళీ కుమార్,
అడ్వకేట్,
బొబ్బిలి, విజయనగరం జిల్లా
బొబ్బిలి
తే 21-9-2025 ది
Mobile No.9440878450

KESHAV MEMORIAL INSTITUTE OF COMMERCE AND SCIENCES
H.NO-3-5-1026, NARAYANAGUDA, HYD-29

Interested and eligible candidates can apply for the posts of **Asst. Professors** in UG for the following **subjects:** Telugu,, Sanskrit, English, Commerce, Management, Computer Science, Physics, Chemistry, Statistics, Mathematics, Microbiology, Bio Technology and Physical Education. **For PG:** Bio Technology, Pure & Applied Statistics, Analytical Chemistry & Physical Chemistry, computer science, **Wanted lab assistants:** for computer, chemistry, bio technology , Physics , microbiology labs. Apply on or before **27.09.2025,** through email: **careers.kmics@gmail.com** or contact in person or call: **8331029974**

Sd/-
Secretary

KESHAV MEMORIAL INSTITUTE OF MANAGEMENT
3-5-1026 Narayanaguda, Hyderabad- 29 Ph:91-8331029974
(Approved by AICTE and Affiliated to Osmania University)

ADMISSION NOTIFICATION

Admission to MBA Course Under Category "B" Seats (2025-26)

Course	Intake	Category "B" Seats
MBA	120	36

The last date for submission of filled in application 27-09-2025.

Secretary

'కపాస్'తో కాటన్ బైపాస్!

- సిసిఐ కొనుగోళ్లలో కేంద్రం తిరకాసు
- అక్రమాల పేరుచెప్పి యాప్ క్రియేషన్
- స్లాట్ బుకింగ్ పేరుతో రైతుకు దూరం చేసే యత్నం
- సాధారణ రైతులు అమ్మడం కష్టమేనని సందేహాలు
- ఈ సీజన్ నుంచే కొత్త విధానం అమలుకు నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం.. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ సామాన్య ప్రజానీకాన్ని మరింత ఇబ్బందుల పాలు చేసే చర్యలకు పూనుకుంటోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోళ్లలో ఈ సీజన్ నుంచి కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశ పెడుతోంది. అక్రమాలు, రద్దీ నియంత్రణ పేరుతో అందుబాటులోకి తెస్తున్న ఈ యాప్ కారణంగా సాధారణ రైతులు సిసిఐకి విక్రయించటం కష్టమేననే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ యాప్ ద్వారా పంట అమ్మాలంటే వారం రోజుల ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్ రోజు అందుబాటులో లేకపోవడమో.. ఏదైనా కారణం చేత విక్రయించలేని పరిస్థితి ఉంటే మరోమారు స్లాట్ బుక్ చేసుకొని మరో వారంపాటు ఎదురుచూడక తప్పదు. అత్యధిక రైతులు పెట్టుబడి పంటగా భావించే పత్తిని సేకరించిన వెంటనే అమ్ముతుంటారు. వారం రోజుల పాటు ఆగే పరిస్థితి ఉండదు.. కాబట్టి ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకునేందుకు మొగ్గుచూపుతారు. జిన్నింగ్ మిల్లుల వద్ద రద్దీ నెలకొనకుండా.. రైతుల సమయం కూడా ఆదా.. అక్రమాలకూ తావుండదని ప్రవేశపెడుతున్న ఈ మొబైల్ యాప్‌తో అక్షరజ్ఞానం పెద్దగా లేని చిన్న, సన్నకారు రైతులు సిసిఐ అమ్మకాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది. అత్యధిక రైతులు సిసిఐ కొనుగోళ్లకు దూరమైతే విదేశాల నుంచి దిగుమతులతో కార్పొరేట్లకు మేలు చేయొచ్చని నరేంద్రమోడీ ప్రభుత్వం ఎత్తుగడగా చర్చ జరుగుతోంది.

రైతులకు ఇబ్బందులే..!

రాష్ట్రంలో 45.85 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఒక్కో ఎకరానికి సగటున 8 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుంది. గతేడాది సుమారు 210.19 లక్షల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. ఈ పంటను సాగు చేసిన రైతుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులే. అత్యధికుల దగ్గర మొబైల్స్ ఉండవు. ఉన్నా స్మార్ట్‌ఫోన్లు చాలా అరుదుగా ఉంటాయి. ఎక్కువ మంది యాప్ వినియోగం గురించి తెలియదు. అక్టోబర్ 1 నుంచి యాప్‌పై అవగాహన కల్పిస్తామని చెబుతున్నా ఎంత మంది రైతులు దీనిపై అవగాహన పెంచుకుని స్లాట్ బుక్ చేసుకోగలుగుతారనేది సందేహమే. అవగాహన లేని రైతులు ఏఈవోల ద్వారా బుక్ చేయించుకోవచ్చని అంటున్నారు...కానీ వ్యవసాయ పనుల ఒత్తిడి తీవ్రంగా ఉండే ప్రస్తుత సమయంలో సాధారణ రైతుకు ఇవి సాధ్యమయ్యే పనులు కాదని రైతుసంఘాల మాట.

దూరం భారమే..!

సాధారణంగా రైతులు తమ సమీపంలోని కేంద్రాల్లోనే పంటను అమ్ముకుంటారు. ఈ స్లాట్ విధానంతో దూరప్రాంతాల్లోని కేంద్రాలకు కూడా స్లాట్ కేటాయించే అవకాశాలు ఉంటాయి. తద్వారా రైతులకు దూరం పెరిగి రవాణాఖర్చులు భారంగా మారుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఇబ్బందులు పడలేక చాలా మంది రైతులు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకునే అవకాశాలున్నాయి. కాబట్టి రైతుల కన్నా వ్యాపారులు లబ్ధిపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

రిజిస్ట్రేషన్ ఓ పెద్ద ప్రాసెస్..

కపాస్ కిసాన్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ ఓ పెద్ద ప్రాసెస్‌గా ఉంది. స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ముందుగా రైతు పేరు, జండర్, డేట్ ఆఫ్ బర్త్, క్యాస్ట్, అడ్రస్, ఆధార్, మొబైల్ నంబర్లు, అడ్రస్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తర్వాత ఏ మార్కెట్ లేదా సెంటర్‌లో పత్తి అమ్మాలనుకుంటున్నారో ఆ వివరాలనూ యాప్‌లో ఎంటర్ చేయాలి. ఫార్మర్ టైప్ అంటే సొంతమా, కౌలుదారా పేర్కొనాలి.

పట్టాదార్ పాస్‌బుక్ నంబర్, సర్వే నంబర్, కొలత రకం, రైతుకు ఉన్న భూమి మొత్తం, దీనిలో పత్తి సాగు విస్తీర్ణం, పంట రకం (దేశీ కాటన్, ట్రెడిషనల్, హెచ్‌డీపీఎస్, క్లోజర్ స్పేసింగ్, రేర్ స్పేసింగ్) తదితర వివరాలతో పాటు రైతుకు సంబంధించిన ఆధార్‌కార్డు, పాస్‌బుక్, రైతు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. చదవడానికే చాట భారతమంత ఉన్న ఇవన్నీ సాధారణ రైతు చేయగలడా..? అసాధ్యమని మార్కెటింగ్‌శాఖ అధికారులే అంటున్నారు. ఈ యాప్ ప్రవేశపెట్టడాన్ని అత్యధిక మంది రైతులు వ్యతిరేకిస్తున్నట్టు చెబుతున్నా ప్రభుత్వం మొండిగా ప్రవేశపెడుతోందని చెబుతున్నారు.

రైతుల నుంచి వ్యతిరేకత

ఈ సీజన్ నుంచి పత్తి కొనుగోళ్లలో ప్రవేశపెడుతున్న స్లాట్ విధానాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారని మార్కెటింగ్‌శాఖ అధికారులే చెబుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సైతం నివేదించారు. ఈ నిబంధనను తొలగించాలని రిపోర్టు పంపారు. అయినా కేంద్రం మాత్రం ఈ సీజన్ నుంచి దీన్ని అమలు చేయాల్సిందే అనే పట్టుదలతో ఉంది.

'హైడ్రా వచ్చింది ఉయ్యాలో.. మా గూడు కూలింది ఉయ్యాలో..'

- గాజులరామారంలో హైడ్రా కూల్చివేతలపై బాధిత మహిళల బతుకమ్మ
- పోలీసు బందోబస్తు మధ్య భారీగా కూల్చివేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్న వేళ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలోని నిరుపేదల బతుకుల్లో అమావాస్య చీకటిని మిగిల్చింది. కుత్బుల్లాపూర్‌లోని గాజులరామారం గ్రామ పరిధి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారులు ఆదివారం కొరడా ఝులిపించారు. వేకువజాము నుండే పోలీసు బలగాల మధ్య వందకు పైగా ఇండ్లను, కొన్ని బేస్మెంట్లను జెసిబిలతో నేలమట్టం చేశారు. బతుకమ్మ కానుకలు ఇవ్వాల్సిన సమయంలో ప్రభుత్వం హైడ్రా రూపంలో కూల్చివేతలను రిటర్న్ గిఫ్ట్‌గా ఇచ్చిందని బాధిత కుటుంబాలు నిప్పులు చెరిగారు. వివరాల్లోకి వెళితే.. గాజులరామారం పరిధిలోని సర్వే నెంబరు 307లో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సంబంధించిన 317 ఎకరాల భూమి ఉంది. ఈ ప్రభుత్వ భూమిని కొన్నేండ్లుగా కొంతమంది భూ భకాసురులు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడి ఎటువంటి అనుమతులు లేకుండా 60 చదరపు గజాల ప్లాట్లుగా విభజించి లే అవుట్లు చేశారు. ఎందరో నిరుపేదలకు అమ్మి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. కాగా, పైసాపైసా కూడబెట్టి కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకొని సంతోషంగా ఉంటున్న తరుణంలో హైడ్రా (హైడ్రోజన్) బాంబుల విరుచుకుపడిందని పలువురు బాధితులు గుండెలవిసేలా రోధిస్తూ రేవంత్ రెడ్డి సర్కార్‌పై శాపనార్థాలు పెట్టారు.

హైడ్రా పై రాళ్లపై దాడి..

గాజులరామారం సర్వే నెంబర్ 307లో కూల్చివేతలు చేయాల్సిన ఆర్డర్ హైడ్రా అధికారులకు ఉండగా సర్వే నెంబర్ 342లో ఉన్న అనఫిషియల్‌గా కూల్చుతున్నారని బాధితులు వాపోయారు. తమకు తెలంగాణ హైకోర్టు ఆర్డర్ ఉన్నా లెక్కచేయకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహించి హైడ్రా, రెవెన్యూ అధికారులపై, పోలీసులపై బాధితులు రాళ్లు విసిరారు. ఇందులో నలుగురు అధికారులు గాయపడ్డారు. జెసిబి అద్దాలను ధ్వంసం చేశారు. దాడికి పాల్పడిన ఇద్దరు యువకులను జగద్గిరిగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక బిఆర్ఎస్ నేత ఎస్‌కె అబీద్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

హైడ్రా వచ్చింది ఉయ్యాలో.. మా గూడు కూలింది ఉయ్యాలో..

ఇదిలా ఉండగా ఎంతో సంబరంగా బతుకమ్మ పండుగ జరుపుకోవాల్సిన సమయంలో హైడ్రా కూల్చివేతలను చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ గాజులరామారం, బాలయ్య బస్తీలో మహిళలు ఇంటి సామగ్రిని బయటపెట్టి బతుకమ్మ వేస్తూ నిరసన తెలిపారు. 'హైడ్రా వచ్చింది ఉయ్యాలో.. మా కొంపలు కూలినై ఉయ్యాలో.. ఎవరికి చెప్పుకుందాము ఉయ్యాలో.. ఎక్కడున్నరు పాలకులు ఉయ్యాలో.. మీకు మా గతి పట్టాలి ఉయ్యాలో..' అంటూ చప్పట్లతో ఆడాల్సిన ఆటలు తలలు కొట్టుకుంటూ కన్నీటితో బాధిత మహిళలు ఆడారు.. ప్రభుత్వంపై, హైడ్రాపై ఉన్న కోపంతో నిరసన చేశారు.

బాధితులకు న్యాయం చేస్తాం: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం

ఇది బీఆర్ఎస్ పాలకుల, కబ్జాదారుల పాపం కారణంగానే పేద ప్రజలు రోడ్డున పడ్డారని, బాధితుల ఉసురు వారికి తుగులుతుందని కూన శ్రీశైలం విమర్శించారు. బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు తాను అండగా ఉంటానని మీడియాతో తెలిపారు.

యువతలోనూ జుట్టు, చర్మ సమస్యలు

- ఎమ్మెల్యే కెపి వివేకానంద గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్

యువతీ, యువకులు అధికంగా జుట్టు, చర్మ సమస్యలతో బాధపడుతున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద గౌడ్ తెలిపారు. జుట్టు పెరుగుదల, చర్మ పునరుజ్జీవనంలో అగ్రగామిగా ఉన్న అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ తన కొంపల్లి బ్రాంచ్ ఒకటో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న 104 బ్రాంచీలు ప్రజల మన్ననలు పొందడం అభినందించదగ్గ విషయమన్నారు. ఇప్పుడు అందరూ జుట్టు, చర్మ సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంతోనే ఈ క్లినిక్ ప్రజల ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎండి శరణ్ వెల్ జే, ఫ్రాంచైజీ భాగస్వామి శ్రీధర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లో ఐసిఐసిఐ ఫ్రుడెన్షియల్ లైఫ్ ముందజ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బీమా పరిశ్రమలో 99.60 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తితో ముందంజలో ఉన్నట్లు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ వెల్లడించింది. ముఖ్యంగా, దర్యాప్తు అవసరం లేని మరణ క్లెయిమ్‌ను పరిష్కరించడానికి సగటు సమయం కేవలం 1.1 రోజులు మాత్రమే తీసుకున్నామని ఆ సంస్థ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ అమిష్ బ్యాంకర్ పేర్కొన్నారు. "క్లెయిమ్‌లనేవి మనం చేసిన వాగ్దానాలకు వాస్తవికతను కలుస్తాయి. ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ వద్ద, ప్రతి క్లెయిమ్‌ను అత్యంత సున్నితత్వంతో నిర్వహిస్తారు, త్వరగా ప్రాసెస్ చేస్తారు. 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కంపెనీ మొత్తం రూ. 406.89 కోట్ల డెత్ క్లెయిమ్‌లను పరిష్కరించింది." అని అమిస్ పేర్కొన్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

- మేడిపల్లిలోని సత్య పాలి క్లినిక్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఆరేండ్ల చిన్నారి మృతిచెందిన ఘటన మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లోని బోడుప్పల్ కార్పొరేషన్‌లోని సత్య పాలీ క్లినిక్‌లో ఆదివారం జరిగింది. ఈ ఘటనతో బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు క్లినిక్ ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. బోడుప్పల్ కార్పొరేషన్‌లో నివాసముండే కొండ రాజు, లావణ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు హాసిని (6)కి వారం రోజులుగా జ్వరం, వాంతులు, బలహీనత వంటి లక్షణాలు కనిపించడంతో ఇటీవల పరీక్షలు చేయించగా ఆమెకు జాండీస్, డెంగ్యూ పాజిటివ్ అని తేలింది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం జ్వరం మరింత పెరగడంతో తల్లిదండ్రులు ఆమెను బోడుప్పల్ దేవేందర్ నగర్‌లోని సత్య పాలీ క్లినిక్‌లో చేర్పించారు. క్లినిక్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి హాసిని మృతి చెందింది. డాక్టర్‌కు అర్హత లేకున్నా చికిత్స చేయడంతో చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్లినిక్ ఎదుట ఆందోళన నిర్వహించారు. మృతురాలి తండ్రి కొండ రాజు పెయింటర్‌గా, తల్లి లావణ్య వాచ్‌మన్‌గా పనిచేసుకుంటూ సరూర్‌నగర్‌లో నివసిస్తున్నారు. చిన్నారి మృతిచెందడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. వైద్యుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు సమాచారం.

సమాజ మార్పుపై సామాజిక మాధ్యమాలలో యువతరం చర్చించాలి

- ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి అబ్బాస్ పిలుపు
- అసమానతలపై సామాజిక ఉద్యమం చేపట్టాలి
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అశాస్త్రీయ భావనలు, మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టేలా సమాజ మార్పు కోసం యువతరం చర్చించాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోషల్ మీడియా విభాగం కన్వీనర్ కోట గోపి అధ్యక్షతన వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి అబ్బాస్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అనేక అబద్ధాలు, మతవిద్వేషాలను ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొడుతున్నారని తెలిపారు. కుల అసమానతలను పెంచి పోషించేలా సామాజిక మాధ్యమాలను వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. దేశం అభివృద్ధి పథంలో ముందుకు నడవాలంటే యువతరం వాస్తవాలను ప్రచారం చేయాలని సూచించారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ సామాజిక ఆర్థిక అసమానతలు 12 ఏళ్ల బిజెపి పాలనలో రెట్టింపయ్యాయని తెలిపారు. మనువాద విష సంస్కృతి, కార్పొరేట్ల ప్రయోజనాలన్నింటిని సామాజిక మాధ్యమాలతో నింపుతున్నారని వివరించారు. వాటిని ఎదుర్కోవటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలు వివిధ యాప్స్ ప్రయోజనాలపై సోషల్ విభాగం రాష్ట్ర నాయకులు పిట్టల రవి, టి10 చానల్ సిఇఒ సుందర్, ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మల్కయ్య అంతటి కాశన్న, గంధం మనోహర్, ఉసిల్ల కుమార్, పాపిట్ల సత్యనారాయణ, బి.బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని సవరించాలి

- ఎంఎల్‌సి పింగిలి శ్రీపాల్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23 (2)ను సవరిస్తూ, టెట్ పరీక్ష నుంచి మినహాయింపునిస్తూ చట్టాన్ని సవరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కోరారు.

ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కిషన్ రెడ్డి స్పందిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా ఏకీకృత సర్వీస్ నిబంధనల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర హోంశాఖ నుంచి ఉత్తర్వులు ఇప్పిస్తానని మాటిచ్చారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, నాయకులు నవీన్ రెడ్డి, గిరిధర్ తదితరులున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్యకు సమానావకాశాలు కల్పించాలి

- ఒయు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.కాశీం
- విద్యలో ప్రయివేటీకరణ వల్లనే అంతరాలు
- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న అలుగుబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

విద్యలో అంతరాలు పోవాలని, అందరికీ నాణ్యమైన విద్యకు సమాన అవకాశాలు కల్పించాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాశీం, తెలంగాణ పౌరస్ స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. ఆదివారం తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'విద్యలో అంతరాలు (అసమానతలు) పోయేది ఎట్లా' అనే అంశంపై హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ప్రొఫెసర్ ఖాశీం, తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎం. రాధేశ్యామ్‌తో పాటు ప్రొఫెసర్ ఖాశీం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖాశీం మాట్లాడుతూ.. తెలంగాణ విద్యా విధానంలో అంతరాలు ఉన్న మాట వాస్తవమని, అవి పోవాలంటే కవులు రచయితలతో పాటు మధ్యతరగతి ప్రజానీకం, మేధావులందరూ దీన్ని ఒక ఉద్యమంగా మలిచేలా కృషి చేయాలని అన్నారు. కవిత్వం అంటే భావోద్వేగానికి సంబంధించిన విషయమని, దాన్ని కవులు తమ కళాదృష్టితో ప్రజలు హత్తుకునేలా చేయగలుగుతారని తెలిపారు. ప్రజాసమస్యల పైన ఆలోచింపజేసే విధంగా కవులు, రచయితలు, ఉద్వేగ భరితమైన రచనలు చేయడంతో తెలంగాణ అస్తిత్వం కోసం జరిగిన ఉద్యమం ప్రజల్ని కదిలించిందని చెప్పారు. విద్యలో అంతరాలు పోవాలనే అంశాన్ని కూడా కవితలు, గేయాల ద్వారా ప్రజల్లోకి తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణ పౌర స్పందన వేదికతో కలిసి పనిచేస్తానని తెలిపారు.

వేదిక రాష్ట్ర అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విద్యలో ప్రయివేటీకరణ మొదలైన తర్వాతే అంతరాలు విపరీతంగా ఏర్పడ్డాయని అన్నారు. ప్రయివేటు బడుల నుంచి యూనివర్సిటీల వరకు అనేక దొంతర్లలో ఫీజులు వసూలు చేస్తున్నారని, దీన్ని క్రమబద్ధీకరించాలని చెప్పారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య లభించినప్పుడే సమాజంలో మెరుగైన మార్పులు వస్తాయని తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తే బలహీన వర్గాల పిల్లలకు విద్యపై మక్కువ ఏర్పడుతుందన్నారు. విద్యలో అంతరాలు తొలగించడానికి తెలంగాణ పౌర స్పందన వేదిక కృషి చేస్తుందన్నారు. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రాధేశ్యామ్ మాట్లాడుతూ.. 1980వ దశకం నుంచి విద్య ప్రయివేటీకరణ మొదలై, నేడు సరళీకరణ విధానాల్లో ఒక సరుకుగా మారిందన్నారు. ఎంత ఖర్చు పెడితే అంత నాణ్యమైన విద్య (సరుకు) దొరుకుతుందనే అభిప్రాయాన్ని పాలకులు ప్రజల మనసులో బలంగా నాటగలిగారని చెప్పారు. విద్య తమ పిల్లల హక్కుగా తల్లిదండ్రులు భావించేలా చైతన్యపర్చాలన్నారు. అలాంటి ప్రయత్నంలో కవులు, రచయితలు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కవి సమ్మేళనంలో కవులు ఏ భూషి నరసింహ, వెన్నెల సత్యం, షేక్ సలీమ, మోహనకృష్ణ, వి.మధుమోహన్, జి.శ్రీనివాస్ గౌడ్, ఎస్.ఎస్.బిగేరా, భువనేశ్వరి, అరుణజ్యోతి, టి.వెంకటి తదితరులు పాల్గొని తమ కవితలు వినిపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేపే మంగ, రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మణరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎంఎ సమద్, ఆర్. సుధాకర్, టి.సురేష్ కుమార్, డి.మస్తాన్‌రావు, ఏ.నాగమణి, జి.రాములు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఎవరి జాగీరూ కాదు

- చంద్రుడు లాంటి కెసిఆర్‌కు మచ్చ తెచ్చారు
- చింతమడక బతుకమ్మ సంబురాల్లో కవిత ఘాటు వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట, చింతమడక ఎవరి జాగిరీ కాదు.. ఎన్ని ఆంక్షలు పెడితే అన్నిసార్లు వస్తా.. తాటతీస్తా..' అంటూ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. 'తల్లీబిడ్డను ఎడబాపారు.. చంద్రుడు లాంటి కేసీఆర్‌కు మచ్చ తెచ్చారు' అంటూ భావోద్వేగంతో కంటతడి పడి పెట్టారు. సిద్దిపేట రూరల్ మండలంలోని మాజీ సిఎం కెసిఆర్ స్వగ్రామమైన చింతమడక గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎంగిలిపూల బతుకమ్మ సంబరాల్లో ఆదివారం ఆమె పాల్గొన్నారు. ముందుగా రాఘవ పూర్ వద్ద గ్రామస్తులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అలాగే అక్కడ గ్రామ మహిళలతో కొద్దిసేపు బతకమ్మ ఆడారు. లక్ష్మీదేవిపల్లి స్టేజీ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం స్వగ్రామం చింతమడకకు చేరుకున్నారు. ఈ క్రమంలో డప్పుచప్పులతో ఆమెకు మహిళలు స్వాగతం పలకగా.. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఇంట్లో బతుకమ్మను పేర్చి రామాలయం ముందు ఉన్న గ్రౌండ్‌లో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 2005కు ముందు తాను ఎన్నోసార్లు గ్రామానికి వచ్చి వెళ్లే దాన్నని, ఆ తర్వాత ఉద్యమంలో బిజీగా మారి ఇక్కడికి రాలేకపోయానని అన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు సిద్దిపేటకు రావాలన్నా, చింతమడకకు రావాలన్న ఎన్నో ఆంక్షలు ఉన్నాయని తెలిపారు. ఇదే చింతమడక గడ్డలో పుట్టిన కేసీఆర్.. ఇక్కడి ప్రజల అండదండలతో, వారిచ్చిన ఆత్మస్థైర్యంతో తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్రాన్ని సాధించి ప్రజలకు సుపరిపాలనను అందించారని అన్నారు. ఆయన చాటున కొందరు అక్రమాలకు పాల్పడి చంద్రుడు లాంటి తన తండ్రికి మచ్చ తీసుకువచ్చారని తెలిపారు. ఆ విషయాన్ని తాను బయటపెట్టినందుకు కుటుంబంలో గొడవలు పెట్టి తల్లిని పిల్లను ఎడబాపారని ఆవేదన వ్యక్తం చేశారు. కచ్చితంగా వారి భరతం పడతానంటూ హెచ్చరించారు. తాను సిద్దిపేటకు, చింతమడకకు రాకుండా ఎన్నో ఆంక్షలు పెడుతున్నారని.. ఆంక్షలు పెడితే ఒక్కసారి కాదు వందసార్లు వచ్చి తన సత్తా చూపిస్తానని తెలిపారు. తనకు చింతమడక జన్మ భూమి అని, రానున్న రోజులు కర్మ భూమి కావచ్చన్నారు.

నాగార్జున సాగర్ సందర్శనలో విషాదం

- నీటి ప్రవాహంలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. సాగర్ సందర్శనకు వచ్చిన కుటుంబం తొందరపాటు కారణంగా కృష్ణా ప్రవాహంలో దిగి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. సాగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన దిరిసెల రాంబాబు (45) మైలాన్ ఫార్మా కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం తన భార్య సుహాసిని, తన ఇద్దరు కొడుకులతో నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చారు. సాగర్ డ్యామ్ దిగువ భాగానికి గేట్ల ద్వారా నీటి విడుదల దృశ్యాలను చూసి సంతోషంగా గడిపారు. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, పాత బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో పర్యటించి అనంతరం శివాలయం ఘాటు వద్దకు చేరుకున్నారు. శివాలయం ఘాటు వద్ద స్నానానికి దిగి భార్య కుమారులు చూస్తుండగానే నీటి ప్రవాహంలో రాంబాబు కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న సాగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పుట్టిలలో వెతికినా రాంబాబు ఆచూకీ లభ్యం కాలేదు. 26 గేట్ల ద్వారా నీటి విడుదల జరుగుతూ ఉండటంతో నీటి అధికంగా ఉంది.

భద్రతా ప్రమాణాలే పరిశ్రమ ప్రగతికి పునాది

- పిఇఎస్ఒ జాయింట్ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోసివ్స్ మిశ్రా

ప్రజాశక్తి - హైదరాబాద్

భద్రతా ప్రమాణాలే పరిశ్రమ ప్రగతికి బలమైన పునాది అని పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోసివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పిఇఎస్ఒ) జాయింట్ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోసివ్స్ వికె మిశ్రా తెలిపారు. దేశంలోని పారిశ్రామిక, వైద్య వాయువుల పరిశ్రమ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ గ్యాసెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'ఇండస్ట్రియల్, మెడికల్ గ్యాసులపై ప్రాంతీయ భద్రతా సదస్సు'ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలంలో ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ గ్యాసెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. కోవిడ్ వంటి సంక్షోభ సమయంలో పరిశ్రమ చేసిన పనులు చాలా ప్రశంసనీయమైనవన్నారు. ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ గ్యాసెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ పరిశ్రమకు, వ్యాపారవేత్తలకు అందించిన సహకారం అభినందనీయం అన్నారు. భద్రతా ప్రమాణాలను ఉన్నతంగా ఉండాలంటే, సిలిండర్ల గుర్తింపు, పీరియాడిక్ టెస్టింగ్, వాడని సిలిండర్లను రద్దు చేయడం వంటి అంశాలపై కఠినంగా ఉండాలన్నారు. ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ గ్యాసెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాకేత్ టికూ మాట్లాడుతూ.. గత ఐదు దశాబ్దాల్లో ఈ అసోసియేషన్ భారత గ్యాస్ పరిశ్రమకు స్వరంగా నిలిచిందన్నారు. పరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ భద్రత, ఆవిష్కరణలకు అగ్రగామిగా ఉందన్నారు. ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ గ్యాసెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజీవ్ గుప్తా మాట్లాడుతూ.. మన గ్యాస్ పరిశ్రమ అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటించే గొప్ప బాధ్యతను మోస్తోందన్నారు. ఈ రోజు జరుగుతున్న సదస్సు ఆ నిబద్ధతకు నిదర్శనమన్నారు. మనం దష్టి సారిస్తున్న గ్యాస్ సిలిండర్ రూల్స్, 2016 అసెంబ్లీ రూల్స్, ఇవి కేవలం నియంత్రణ నిబంధనలు మాత్రమే కావన్నారు.

వచ్చే మూడు రోజుల్లో భారీ వర్ష సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, నిజామాబాద్, రంగారెడ్డి, నిర్మల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఈ నెల 25 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని, అది వాయుగుండంగా మారి 27న దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర కోస్తా ప్రాంతంలో తీరం దాటే అవకాశముందని తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 525 ప్రాంతాల్లో వర్షం కురిసింది. 20 ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. రాష్ట్రంలో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో 11.4 సెంటీమీటర్ల భారీ వర్షపాతం రికార్డయింది. జనగామ జిల్లా దేవరుప్పలలో 11.1 సెంటీమీటర్ల వాన పడింది. వచ్చే 48 గంటల పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలు బలంగా ఉన్నాయి.

రైతుల భూముల్ని, జీవనోపాధిని కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల భూముల్ని, జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ట్రిబుల్ ఆర్ బాధిత రైతులు రాంచందర్‌రావును కలిశారు. ఆర్‌ఆర్‌ఆర్ వల్ల తమకు జరిగే నష్టం గురించి వివరించారు. జీవనోపాధి పోతుందని మొరపెట్టుకున్నారు. దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్పు వల్ల సాగు భూముల్ని కోల్పోతున్నామని వాపోయారు. ప్రస్తుతం ఖరారు చేసిన దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను రద్దు చేసి పున: సర్వే చేసేలా రాష్ట్ర సర్కారుపై ఒత్తిడి తేవాలని కోరారు. పక్కనే ఉన్న రాచకొండ గుట్టలను రహదారి కోసం వినియోగిస్తే పంట భూముల్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. రైతుల గోడును విన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు చొరవ తీసుకుంటానని ఈ సందర్భంగా రాంచందర్‌రావు హామీ ఇచ్చారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను పునఃసమీక్షించి రైతులకు నష్టం లేకుండా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.